
INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:7(4), July: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 4th July
Publication Date:30th July 2021


Cover Page

DOI: http://ijmer.in.doi./2021/10.07.89

# గార్హస్థ్యం - కళ్యాణప్రదం

పఠాన్ ఖాసిం ఖాన్,
అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు,
ఆధునిక భారతీయ భాషల విభాగం,
అలీఘుర్ ముస్లిం విశ్వవిద్యాలయం,
అలీఘుర్, ఉత్తర్ప్రదేశ్ - 202002

గార్హస్థ్యం మానవసృష్టి, స్థితి, వృద్ధి, రతి, రక్తి, శాంతి, ముక్తి ఇత్యాదులకు మూలం. సతీపతులిద్దరికి ఇందు సమప్రాధాన్యం. ఆంధ్రమహాభారత సూక్తులాధారంగా వీరి ధర్మాలను పరిశీలించటం ప్రస్తుతం.

ఆదివర్వంలో ''అనుగుణ భార్యవంతుడు, క్రియావంతుడు, దాంతుడు, పుత్రవంతుడు నయినవాడు సంతతం గృహమేధిఫలమంతా పొందగా సమర్థుడని ఉక్తం. 1. ఇందులో మొట్టమొదటిదైన'' అనుగుణ భార్యావంతుడు'' గురించి పరిశీలిద్దాం. ''ధర్మార్థకామసాధనకుపకరణం, గృహనీతి విద్యకు గృహం, విమల చారిత్రశిక్షకాచార్యకం, అన్వయస్థితికి మూలం, సద్గతికి ఊతం, గౌరవానికి ఏకకారణం, ఉన్నత స్థిరగుణాలకాకరం, హృదయ సంతోషానికి సంజనకం, సతీమణి'' అని 2. ఆదిపర్వం నందే ప్రకటితం. ఇక్కడ భార్యకుండవలసిన గుణ పరంపర ప్రవిదితం. ఈ గుణ పరంపర భర్తకు సహితం ఉండి తీరాల్సిందేనని "అనుగుణభార్యావంతుడు" అనునది నిర్దేశిస్తుంది. ఏతన్మూలమున ప్రప్రథమంగా వధూవరుల ఎంపికలో పరిశీలనార్హాంశములు ప్రస్ఫుటం.

రెండవది క్రియావంతుడగుట. అంటే "ఆచరణశీలి" అని అనవచ్చు. ఆచరించవలసిన క్రియలు ఏవో చూద్దాం. "నిజదారైకపరత్వం, కరుణ, సత్యం, సహనం, సజ్జన సంగమం, దేవపితృ అతిథి సంశుద్ధార్చనలు, హవ్య భుగ్భజనం, సకలాశ్రమస్థులను శక్య ప్రక్రియతో ప్రోపులను బ్రహ్మ గృహస్థధర్మాలుగా కల్పించాడని. 3. శాంతిపర్వము నందుక్తం. వీనిలో ప్రథమధర్మం నిజదారైకపర్వతం ప్రధాన కర్తవ్యం. ఇది బహు సమస్యల పరిష్కారాయుధం. ఆనుశాసనిక పర్వంలో పురుషునకు పరదారగమనమొప్పదు. అది అన్నింటిని మించిన మహాపాపం. ఆయుస్స0క్షయకరం. తద్వర్జనం కడుమేలు'' అని ప్రవక్తం. 4. పరదారగమనమే కాదు పర స్త్రీ గమనం సహితం మహాపాపంగా పరిగణించటం మిక్కిలి యుక్తం. వ్యభిచారం పరస్పర ప్రమేయంతోనే సాగుతుంది. కాబట్టి ప్రతి స్త్రీ కూడా పరపురుష గమనాన్ని వర్జించాలి. స్త్రీ పురుషులు సదాసర్వధాసర్వత్ర అట్టి దురాచారాలను రూపుమాపటానికి కృషి చేస్తూనే ఉండాలి. "సురతము గుప్తమగుట ఆయురవాప్తిని జేస్తుందని'' 5. శాంతిపర్వము నందు ప్రవిదితం. అందుకోసం దంపతులు ఆయుస్సంక్షయకరమైన వ్యభిచారాన్ని వర్జించి ఆయురవాప్తిని చేకూర్చే సురతాన్ని గుప్తంగా సల్పుట కడుమేలు.

మానం మనఃప్రీతిని పెంచుతుంటే అవమానం అణచుతుంది. అందుకే ఆదిపర్వమునందు "సతి, గుణవతి, సంతానవతి, అనువ్రత అయిన వనితను అవజ్ఞాన్విత దృష్టితో చూసే దుర్మతికి ఇహపరములుండవని'' 6. విరచితం. ప్రకృతసూక్తి పత్నిని అవమానించటమే కాదు అవమానంతో కూడిన దృష్టితో చూసినా అతనికి ఇహపరములుండవని ప్రస్ఫుటం చేస్తుంది. అట్టివాడు అతిదుర్మతి అని కూడ ప్రకటితం. కరుణ, సత్యం, సహనం, సజ్జనసంగమం సహితం సంసారం సత్పథాన సాగటానికి, సత్ఫలాన్ని పొందటానికి సమధికావశ్యకం.

తదుపరి దేవ పితృ అతిథి సంశుద్ధార్చనలు సహితం గృహస్థధర్మాలుగా ప్రవక్తం. సద్గతికి, సద్వర్తనానికి దైవభక్తి సదావశ్యకం. అరణ్యాపర్వంలో "జనని, జనకుడు, సద్గురుడు, అనలుడు, ఆత్ముడు అనే ఈ ఐదుగురు సుగతి వాంఛతో ఏ గృహస్థుని చేత ప్రసాదితులవుతారో అట్టివాడే వసుధ మీద ధర్మాత్ముడని''ప్రకటితం. 7. ఎవని అనువర్తనంతో తల్లిదండ్రులు ప్రియమును పొందుతారో తత్తనయుడు అక్షయగతులతో, అనూనంగా ధర్మాన్ని, కీర్తిని పొందగలడు. 8. తల్లిని తండ్రిని విడుచుట తగదు. అకారణమున విడిచినవాడు పతితుడు. అట్టివాడు తన చిన్నారి తనయులకు ఆసనం,శయ్య, భోజనం, వస్త్రాలు ప్రీతితో ఒసంగితే కీడు కలుగుతుంది. 9. తనకు, తనయులకు, సతులకు, జననీజనకులకు, బంధుజనులకు కీడు కలుగని విధమున కీర్తి సముపార్జింపతగును గాని అందరు చెడిపోయే కీర్తి ఎందుకు పనికి రాదు. 10. ఈ సూక్తుల వలన తనను, తల్లిదండ్రులను, గురువును, అనలుని ప్రసన్నం చేసుకొనిన గృహస్థుడు ధర్మాత్ముడని, అతడు ధర్మ, కీర్తులను పొందటానికి తల్లిదండ్రుల ప్రియమే ప్రధానమని ప్రవిదితం. తల్లిదండ్రులను విడిచి తనయులను చూసుకొనే పతితునకు, తానింతవాడగుటకు తన తల్లిదండ్రులే కారకులని, వారు కూడ తమ తనయులను తనలాగే చూసుకొని ఉంటారని అవశ్యం స్మరణకు రావాలి. కీర్తి నార్జించటంలో కీడు కలగకుండా జాగ్రత్తగా ఉండాలి.

దంపతులు కృతార్థులగుటకు అతిథి సేవ సహితం అత్యావశ్యకం. "అతిథులు తమ వాంఛితములనుభవించునట్లు చేసి, గృహస్థుడు గృహిణి కృతకృత్యతను పొందుతారని'' 11. సూక్తి, తమ శక్త్యానుసారం సర్వజనబాధ్యతలను నెరవేర్చటం సర్వ ధర్మ సంకలనం. అందుకే గృహస్థాశ్రమం ఒక్కటే తక్కిన మూడాశ్రమములతో సరితూగుతుందని 12. ఉద్ఘాటనం.

ఇంక మూడవది దాంతుడగుట, ధర్మసాధనకు ముఖ్యమైనది. ఇంద్రియార్థాలకు వశమైన పురుషుడు గాఢరాగంతో కరిగిపోతుంటాడు. రాగం వలన లోభం కలుగుతుంది. తద్వారా కరుణకు లోనుగాడు. దానితో పాపక్రియకు మరుగుతాడు. తగువారు

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :7.816(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:7(4), July: 2021
Online Copy of Article Publication Available: www.ijmer.in
Digital certificate of publication: http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 4th July
Publication Date:30th July 2021
Cover Page
DOI: http://ijmer.in.doi./2021/10.07.89

చెప్పే తగవు వినడు. ప్రీతితో కుజనుల పక్షం చేరుతాడు. త్రికరణశుద్ధి ఉండదు. ఇహమునందు పుణ్యహీనుడై చెడిపోతాడు. పరము నందు ధుఃఖభారాన్ని పొందుతాడు. కావున ఇంద్రియార్థగతిని పోకుండా, సాధుసంసర్గం చేసి సుగతిని పోవటం మంచిదని. 13. ప్రబోధం. ఇందు ఇంద్రియనిగ్రహానికి సాధుసంసర్గం సత్సాధనమని సద్విదితం. అందుకే బ్రహ్మ, సజ్జనసంగమం సహితం గృహస్థధర్మంగా ఉగ్గడించినాడు.

ఇంక చివరిది పుత్ర వంతుడగుట. అంటే సంతానవంతుడని భావించుట మిక్కిలి సమంజసం. అంతే కాని కేవలం పుత్ర వంతుడనుకొనుట పెద్ద పొరపాటు. ఎందుకంటే ఏ సంతానం కలగాలన్నా ఆవశ్యం స్త్రీపురుషులిద్దరూ ఆవశ్యకమే. అందుకే దంపతులు స్త్రీ ,పురుష సంతతి కలిగి ఉండాలి. తల్లిదండ్రులగుటయే భార్య భర్తలగుటకు ప్రధాన ధర్మం, కారణం, ఫలితం. భార్య ఋతుమతియై పుత్రార్థం భర్తను కోరినపుడు అతడు ప్రతికూలుడై ఋతు విఫలత్వం చేస్తే భ్రూణ హత్య చేసినవాడవుతాడని బుధుల బోధం.14. తల్లిదండ్రులు తమ జన్మకు కారకులైనట్లే తమ సంతతికి తాము కారకులగుట అత్యాజ్యమైన ధర్మం. అట్లే సద్గురువులు తమ ఆ విద్యకు కారకులైనట్లే తమ శిష్య తతి విద్యకు తాము కారకులగుట అవ్యాజ్యమైన ధర్మం.

ఇతరులకు అప్రియం చేస్తే వారికి బాధ కలుగుతుంది. తద్వారా పాపం ప్రాప్తిస్తుంది. పాపం తో ధర్మం నశిస్తుంది. అందుకే ఇతరులు ఏవి చేస్తే తన మనసుకు అప్రియం కలుగుతుందో అవి ఇతరులకు చేయకుండా ఉండటం పరమ ధర్మ పథాలన్నింటిలో పరాయణమైనది.15. అనే సూక్తి సంతతం స్మృతి పథంలో సంచరిస్తూనే ఉండాలి. ఇదే సూక్తిని ఇతరులు ఏవి చేస్తే తమ మనసుకు ప్రియం కలుగుతుందో అవి ఇతరులకు చేయడం పరమ ధర్మ పరాయణమని మరో విధంగా చెప్పవచ్చు. కానీ ఇతరులకు మేలు చేయక పోవడం వలన జరిగే నష్టం కంటే కీడు చేస్తే జరిగే నష్టం అధికం. అది పాపం. అందుకే తిక్కన అలా విరచించాడు.

సంసార సాగరాన్ని తరించలేక కొందరు ఆత్మహత్యలు చేసుకుంటూ ఉంటారు. తాము ప్రాణం పోసుకేలేదు కాబట్టి తీసుకునే హక్కు లేదు. అందుకే అది అధర్మం. ఆత్మఘాతుకునకు లోకంబున నింద యు,
హీనతయు,దుర్గతియును,ప్రాపించునని ఉపదేశం.16. కావున ఆత్మహత్యల దరిదాపులకు సహితం చేరకుండా సహనంతో సాంసారిక జీవితం సాగించాలి. ప్రాణం, పైకం, పరిమిత కాలం తన సొంతం కావు. అవి పరమాత్మా ధీనం. లేదంటే ప్రకృతి అధీనం. ప్రాణం తనతోనే ఉండదు. పైకం తనతో రాదు. కాలం తనతో నడవదు. అందుకే వీటిని అందరి కోసం వెచ్చించాలి. గృహస్థాశ్రమ సకల ధర్మ సదా చరణం కష్టసాధ్యం. కల్యాణ ప్రదం. కైవల్య దాయకం.

**అంతస్సూచికలు:**

1. ఆంధ్రమహాభారతము - నన్నయ - ఆదిపర్వము - 4-83
2. పైదే - నన్నయ - ఆదిపర్వము - 4-35
3. పైదే - తిక్కన్న - శాంతిపర్వము - 2-231
4. పైదే - తిక్కన్న- అనుశాసని పర్వము - 4-92
5. పైదే - తిక్కన్న- శాంతిపర్వము - 4-119
6. పైదే - నన్నయ - ఆదిపర్వము - 4-82
7. పైదే - ఎర్రన - అరణ్య పర్వము - 5-118
8. పైదే - ఎర్రన - అరణ్య పర్వము - 5-6
9. పైదే - తిక్కన్న- శాంతి పర్వము - 3-440
10. పైదే - ఎర్రన - అరణ్య పర్వము - 7-298
11. పైదే - తిక్కన్న- అనుశాసని పర్వము - 1-67
12. పైదే - తిక్కన్న- శాంతి పర్వము - 1-75
13. పైదే - ఎర్రన - అరణ్య పర్వము - 5-81
14. పైదే - నన్నయ - ఆది పర్వము - 3-188
15. పైదే - తిక్కన్న- శాంతి పర్వము - 5-220
16. పైదే - ఎర్రన - అరణ్య పర్వము - 6-42

**ఉపయుక్త గ్రంథసూచి:**

1. ఆంధ్రమహాభారతము -నన్నయ, తిక్కన, ఎర్రన.
2. ఆంధ్రమహాభారతము సూక్తి రత్నాకరము - డాక్టర్. గుత్తా సురేష్ బాబు
3. ప్రవక్త సూక్తిశతకం - ముహమ్మద్ జైనుల్ ఆబెదీన్.